క్లుప్తంగా

కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా సీపీఐ ధర్నా



కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

కాకినాడ సిటీ: ఆంధ్రప్రదేశ్‌కు బడ్జెట్ కేటాయించడంలో తీవ్ర అన్యాయం చేసిన కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా శుక్రవారం ఎల్ఐసీ కార్యాలయం వద్ద సీపీఐ ధర్నా చేపట్టింది. ఎల్ఐసీ, ఎస్‌బీఐలో ప్రజల సొమ్మును దోచుకుంటున్న అదానీ, అంబానీలకు కాపలా కాస్తున్న కేంద్ర ప్రభుత్వానికి ప్రజలే గుణపాఠం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి చెల్లించాల్సిన టాక్స్ ఎగ్గొట్టే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. ఆంధ్ర రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చేందుకే కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి బడ్జెట్ కేటాయించడంలో మొండి చేయి చూపించిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు తోకల ప్రసాద్, జి.లోవరత్నం, పెద్దిరెడ్డి సత్యనారాయణ, పప్పు ఆదినారాయణ, బొబ్బిలి శ్రీనివాసరావు, ఎమ్మెస్ నారాయణ, జె.బాబీ, కసిరెడ్డి వీర్రాజు, లక్ష్మణ్, బంగారు రాజేష్, కామేశ్వరరావు, దుర్గ, అప్పలకొండ తదితరులు పాల్గొన్నారు.

ఆర్జేడీ నాగమణి బాధ్యతల స్వీకరణ



ఆర్జేడీగా బాధ్యతలు స్వీకరిస్తున్న నాగమణి

కాకినాడ సిటీ: పాఠశాల విద్యాశాఖ ఆర్జేడీ జి.నాగమణి శుక్రవారం జిల్లా కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత ఆర్జేడీ మధుసూదనరావు బదిలీ అయ్యారు. నాగమణి ఉమ్మడి రాష్ట్రంలో నల్గొండ జిల్లాలో ఉపాధ్యాయినిగా 11 ఏళ్లు పనిచేసి, 2017–21 మధ్య విశాఖపట్నం, విజయనగరం జిల్లాల్లో డీఈఓగా బాధ్యతలు నిర్వర్తించారు. 2021లో పాఠశాల విద్య జేడీగా బాధ్యతలు నిర్వహించారు. ప్రస్తుతం బదిలీపై కాకినాడ వచ్చారు. ఆర్జేడీ నాగమణి మాట్లాడుతూ పాఠశాలల్లో గుణాత్మక విద్య పెంపొందించేందుకు కృషి చేస్తానని, ప్రభుత్వం నిర్దేశించిన ప్రకారం పరీక్షలు పారదర్శకంగా నిర్వహించి నూరుశాతం ఫలితాలు తీసుకొచ్చేందుకు కృషి చేస్తానన్నారు. ఆమెను కార్యాలయ సిబ్బంది, ఉపాధ్యాయ సంఘాలు, ప్రతినిధులు, తదితరులు కలిసి అభినందించారు. అనంతరం ఆమె జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, జేసీ ఇలక్కియలను మర్యాదపూర్వకంగా కలిశారు.

హెల్త్‌కేర్ విభాగంలో ఇంటర్న్‌షిప్

- వీసీ ప్రసాదరాజు



ఒప్పంద పత్రాలతో జేఎన్‌టీయూకే వీసీ ప్రసాదరాజు తదితరులు

బాలాజీచెరువు: మహారాజ హెల్త్‌కేర్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్, జేఎన్‌టీయుకే మధ్య ఎంఓయూతో విద్యార్థులకు హెల్త్‌కేర్ విభాగంలో ఇంటర్న్‌షిప్ ఇచ్చేందుకు అవకాశం కలుగుతుందని ఉపకులపతి జీవీఆర్ ప్రసాదరాజు పేర్కొన్నారు. జేఎన్‌టీయుకే వీసీ కాన్ఫరెన్స్‌హాలులో శుక్రవారం ఇంక్యుబేషన్ సెంటర్ ఆధ్వర్యంలో ఈ ఒప్పందం జరిగింది. వీసీ ప్రసాదరాజు, రిజిస్ట్రార్ ఎల్.సుమలత, ఓఎస్‌డి డి.కోటేశ్వరరావు హాజరుకాగా మహారాజ హెల్త్‌కేర్ సర్వీసెస్ కంపెనీ సీఈవో వైవీవీఎస్ఎన్ రాజు పాల్గొన్నారు. ఆరోగ్య సమస్యలకు సంబంధించిన పరిజ్ఞానంలో మహారాజ హెల్త్‌కేర్ కంపెనీ విద్యార్థులకు శిక్షణ ఇచ్చి తోడ్పడుతుందన్నారు. ఈ శిక్షణ ఇంక్యుబేషన్ సెంటర్ ఆధ్వర్యంలో జరుగుతుందన్నారు.

మానవత, నైతికతతోనే సత్సమాజం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ రఫీక్

బోట్‌క్లబ్: మానవత, నైతికతతోనే సత్సమాజం సాధ్యమవుతుందని జమాతే ఇస్లామీ హింద్ రాష్ట్ర అధ్యక్షులు ఎండీ రఫీక్ అన్నారు. మానవత–నైతికత నినాదంతో శనివారం నుంచి 20వ తేదీ వరకు జాగృతి ఉద్యమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. మానవత్వం, సత్యం ఆధారంగానే మనల్ని దైవం సృష్టించాడని, దేవుని దృష్టిలో మానవ ప్రాణం అత్యంత విలువైనదన్నారు. ఉద్యమంలో భాగంగా సామాజిక, రాజకీయ, వివిధ ప్రత్యేక రంగాలకు చెందిన ప్రముఖులతో రౌండ్ టేబుల్ సమావేశాలు, వివిధ మతాల ఆధ్యాత్మిక గురువులతో చర్చాగోష్ఠి నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ మేరకు ఉద్యమ కరపత్రాన్ని ఆయన ఆవిష్కరించారు. సంస్థ అధ్యక్షులు ఇబ్రహీం, రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ హుస్సేన్, జిల్లా ఉద్యమ పర్యవేక్షకుడు అహ్మద్, మహిళా విభాగం బాధ్యులు నజ్మా పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి

- ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి
- 23వ డివిజన్‌లో గడప గడపకూ..



లబ్ధిదారుకు ప్రభుత్వ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి

కాకినాడ: ప్రజా సంక్షేమానికి పరితపించే సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి కోరారు. స్థానిక జగన్నాథపురం 23వ డివిజన్‌లో శుక్రవారం గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహించారు. మేకావారివీధి, నలమాటివీధి, గోపీవారి సందు ప్రాంతాల్లో ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకుంటూ మూడున్నరేళ్ల ప్రభుత్వ పాలనలో ప్రజలకు అందించిన లబ్ధిని వివరించారు. కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, మాజీ కార్పొరేటర్లు మీసాల దుర్గాప్రసాద్, మీసాల శ్రీదేవి వీరి వెంట ఉన్నారు. ఎమ్మెల్యే ద్వారంపూడి మాట్లాడుతూ నవరత్న పథకాలు ద్వారా పేదల జీవితాల్లో వెలుగులు నింపిన సీఎం జగన్ ఇప్పటికీ ఇవ్వని ఎన్నో హామీలను అమలు చేస్తూ నిత్యం పేద, బడుగు, బలహీనవర్గాల సంక్షేమానికి అహర్నిశలు పాటుపడుతున్నారన్నారు. ఇటువంటి ముఖ్యమంత్రిని మళ్ళీ ఆశీర్వదించాలని కోరారు. ప్రజల ఆదరాభిమానాలు చూరగొన్న ముఖ్యమంత్రిపై ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వక్ఫ్ బోర్డు డైరెక్టర్ అబ్దుల్ బషీరుద్దీన్, మాజీ డిప్యూటీ మేయర్ మీసాల ఉదయ్‌కుమార్, మాజీ కార్పొరేటర్లు నల్లబెల్లి సుజాత, కర్రి శైలజ, పేర్ల జోగారావు, జగన్నాథన్ విజయ్‌కుమార్, సంగాని నందం, కామాడి సీత, నగర బీసీసెల్ అధ్యక్షుడు పేర్ల రజనీకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మీరే విజయ సారథులు

- ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి
- కన్వీనర్లు, గృహ సారథులకు దిశానిర్దేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారంపూడి. చిత్రంలో రాగిరెడ్డి దీప్తి, శివప్రసన్న తదితరులు

కాకినాడ: రానున్న ఎన్నికలకు పార్టీ డివిజన్ కన్వీనర్లు, గృహసారథులే విజయసారథులని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. స్థానిక తూరంగిలోని ఎస్‌సీవీ ఫంక్షన్‌హాలులో శుక్రవారం 14 నుంచి 26వ డివిజన్ పరిధుల్లో కన్వీనర్లు, గృహసారథలతో ఆయన సమావేశమయ్యారు. వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎమ్మెల్యే ద్వారంపూడి మాట్లాడుతూ ప్రభుత్వం ఇస్తున్న పింఛన్ల నుంచి సంక్షేమ పథకాల వరకు ప్రతి ఒక్క అంశాన్ని ప్రతీ గడపకు తీసుకువెళ్లాల్సిన బాధ్యత కన్వీనర్లు, గృహసారథులపై ఉందన్నారు. వలంటీర్ పరిధిలో ఉండే ఇద్దరు గృహసారథులపై సీఎం జగన్ కీలక బాధ్యత పెట్టారని, అది నెరవేర్చే దిశగా కష్టించి పనిచేయాలని కోరారు. ప్రధానంగా ఆయా కుటుంబాలతో మమేకమవుతూ ఎలాంటి కష్టం వచ్చినా పథకాలు అందకపోయినా, సమస్యలు ఉన్నా పార్టీ మీ వెంటే ఉంటుందన్న భరోసా కల్పించాలన్నారు. రానున్న ఏడాది కాలంలో ఈ విషయాన్ని అత్యంత బాధ్యతగా తీసుకుని పనిచేయాలని కోరారు. పార్టీ నగర అధ్యక్షురాలు శివప్రసన్న మాట్లాడుతూ పార్టీ అందించే కరపత్రాలను ప్రజలకు చేరేలా కృషి చేయాలన్నారు. కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి మాట్లాడుతూ ఇకపై కన్వీనర్లు, సారథులు సమన్వయంతో ప్రణాళికాబద్ధంగా కష్టించి పనిచేయాలన్నారు. రాష్ట్ర వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ అబ్దుల్ బషీరుద్దీన్, రాష్ట్ర ప్రచార కమిటీ ప్రధాన కార్యదర్శి రావూరి వెంకటేశ్వరరావు, డిప్యూటీ మేయర్లు చోడిపల్లి ప్రసాద్, మీసాల ఉదయ్‌కుమార్, పసుపులేటి వెంకటలక్ష్మి, స్మార్ట్‌సిటీ మాజీ చైర్మన్ అల్లి రాజబాబు, జగన్నాథపురం ప్రాంతానికి చెందిన మాజీ కార్పొరేటర్లు, కన్వీనర్లు, గృహసారథులు హాజరయ్యారు.

14 నుంచి 19 వరకు ప్రత్యేక చేనేత వస్త్ర ప్రదర్శన

కాకినాడ సిటీ: జిల్లా చేనేత, జౌళిశాఖ ఆధ్వర్యంలో ఈనెల 14 నుంచి 19వతేదీ వరకు కాకినాడ దేవాలయం వీధిలోని పైడా చలమయ్య శ్రీనివాస కళ్యాణ మండపంలో ప్రత్యేక చేనేత వస్త్ర ప్రదర్శన, విక్రయాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా చేనేత, జౌళిశాఖ జిల్లా అధికారి కె పెద్దిరాజు శుక్రవారం తెలిపారు. ఈ ప్రదర్శనను ఈ నెల 14న కలెక్టర్ కృతికా శుక్లా ప్రారంభిస్తారన్నారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల చేనేత, పట్టు వస్త్రాలతో పాటు కాటన్, మెర్సిరైజ్డ్, టై అండ్ డై చీరలు, సీకో చీరలు, మాధవరం, వెంకటగిరి జరీ చీరలు, మంగళగిరి డ్రెస్ మెటీరియల్, ఉప్పాడ జాంధాని చీరలు, కాటన్ షర్టింగ్స్, కలంకారి వస్త్రాలు, పొందూరు ఖద్దరు, పెద్దాపురం సిల్క్ షర్టింగ్స్ ఉంటాయన్నారు. వీటితో పాటు ప్రఖ్యాతి గాంచిన బెడ్ షీట్స్, పేరెన్నిక గన్న ఆకర్షణీయమైన వస్త్ర ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ ప్రదర్శనకు రాష్ట్రం నలుమూలల నుంచి, తెలంగాణ రాష్ట్రం నుంచి దాదాపు 30 చేనేత సహకార సంఘాల ఉత్పత్తిదారులు పాల్గొంటున్నారని పెద్దిరాజు తెలిపారు. ఈ వస్త్ర ప్రదర్శనకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈ వస్త్ర ప్రదర్శనకు ప్రవేశం ఉచితమని, చేనేత ఉత్పత్తులు సరసమైన ధరలకు అందుబాటులో ఉంచామన్నారు. కాకినాడ, పరిసర ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగపర్చుకొని చేనేత ఉత్పత్తులను కొనుగోలు చేసి చేనేత వస్త్రాలను ధరించి నేత కార్మికులకు చేయూతనివ్వాలని జౌళిశాఖ అధికారి పెద్దిరాజు కోరారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత



రోటరీ సమావేశంలో మాట్లాడుతున్న బ్రహ్మకుమారి రజని

బోట్‌క్లబ్: ధ్యానం ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వ విద్యాలయం జిల్లా హెడ్ సిస్టర్ రజని అన్నారు. స్థానిక రోటరీహాల్‌లో శుక్రవారం జరిగిన రోటరీ సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ప్రతి ఒక్కరూ మనస్సును శాంతి కాముకులుగా మలుచుకుంటే సమాజంలో శాంతి నెలకొంటుందన్నారు. అనంతరం పీస్ , ఇంటిగ్రేషన్ అంశంపై ప్రసంగించారు. నూతనంగా రోటరీ సభ్యత్వం స్వీకరించిన చందు, అడబాల ప్రభలకు రోటరీ గవర్నర్‌గా ఎన్నికైన కల్యాణ్‌చక్రవర్తి రోటరీ పిన్‌ను బహూకరించారు. కల్యాణ్‌చక్రవర్తిని, సీనియర్ సభ్యులైన జయరామ్ దంపతులను సత్కరించారు. క్లబ్ కాకినాడ అధ్యక్షురాలు సురభి శారద, రోటరీ అసిస్టెంట్ గవర్నర్ తడాల వరప్రసాద్, సభ్యులు పాల్గొన్నారు.

శ్రీచైతన్యలో యాన్యువల్‌డే స్పోర్ట్స్ మీట్



బహుమతులు సాధించిన విద్యార్థులతో శ్రీచైతన్య పాఠశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు

బాలాజీచెరువు: కాకినాడ శాంతినగర్‌లోని శ్రీ చైతన్య పాఠశాలలో ప్రీ ప్రైమరీ, ప్రైమరీ యాన్యువల్ స్పోర్ట్స్ మీట్ శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఏజీఎం వి.సురేష్, రీజనల్ ఇన్‌చార్జి పి.గోపీనాథ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అథ్లెటిక్ అసోసియేషన్ కార్యదర్శి టీవీఎస్ రంగారావు హాజరయ్యారు. ముందుగా పాఠశాల హెచ్ఎం ఉమాలక్ష్మి మాట్లాడుతూ నేటి కాలంలో విద్యార్థులకు చదువుతో పాటు మానసిక, శారీరక వ్యాయామాలు ఎంతో అవసరమని, క్రీడల ద్వారా విద్యార్థులలో నాయకత్వ లక్షణాలు అలవడతాయని చెప్పారు. ముఖ్య అతిథి రంగారావు క్రీడాజ్యోతి వెలిగించి, శాంతి కేతనాన్ని ఎగురవేశారు. అనంతరం ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ నేటి సమాజంలో సంభవిస్తున్న పరిణామాల రీత్యా ప్రతి ఒక్కరూ మానసిక ఒత్తిడికి గురవుతున్నారని క్రీడల వల్ల పిల్లల్లో శారీరక దృఢత్వం మెరుగుపడుతుందని, దీంతో మానసిక ఉల్లాసం పెంపొందుతుందన్నారు. దానికి అనుగుణంగా విద్యార్థులను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తయారుచేయాలని సూచించారు. పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు పతకాలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థులు చేసిన నృత్యాలు, పిరమిడ్స్, క్రీడలు ఆకర్షించాయి. విద్యార్థుల తల్లిదండ్రులకు కూడా క్రీడా పోటీలు నిర్వహించి బహుమతి ప్రదానం చేశారు. పాఠశాలల ప్రిన్సిపాళ్లు సుల్తానా, శైలజ, జయశ్రీ, ప్రీ ప్రైమరీ జోనల్ ఇన్‌చార్జి శేషశ్రీ, ప్రైమరీ ఇన్‌చార్జి విశ్వప్రియ, క్యాంపస్ ఏవో శ్రీవికాస్, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

నేడు ఘంటసాల వర్ధంతి

కాకినాడ కల్చరల్: సీతారామరాజు స్మారక కళావేదిక అనుబంధ సంస్థ ఘంటసాల సంగీత కళాపీఠం ఆధ్వర్యంలో స్థానిక బాల త్రిపుర సుందరి ఆలయం సెంటర్‌లోని అమరగాయకులు ఘంటసాల వెంకటేశ్వరావు కాంస్య విగ్రహం వద్ద శనివారం ఉదయం 9 గంటలకు ఆయన వర్ధంతి నిర్వహిస్తున్నారు. కళాపీఠం కన్వీనర్ పంపన దయానందబాబు ఈ మేరకు తెలిపారు. కళాపీఠం సభ్యులు, ఘంటసాల అభిమానులు వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ప్రజ్ఞ వికాస పరీక్షకు విశేష స్పందన

కాకినాడ సిటీ: భారత విద్యార్థి ఫెడరేషన్, ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 10, 11, 12 తేదీల్లో జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న ప్రజ్ఞ వికాస పరీక్షకు జిల్లాలో విశేష స్పందన వచ్చిందని, ఆ సంస్థల జిల్లా కార్యదర్శి ఎం.గంగా సూరిబాబు తెలిపారు. శుక్రవారం మొదటి రోజు పరీక్షను స్థానిక ఓ ప్రవేట్ పాఠశాలలో నిర్వహించినట్లు తెలిపారు.

నన్నయలో మెగా రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న ప్రిన్సిపాల్ కమలకుమారి. చిత్రంలో వైడీ రామారావు, మాణిక్‌రెడ్డి సత్యనారాయణ తదితరులు

కాకినాడ రూరల్: మండలంలోని తిమ్మాపురం గ్రామం అచ్చంపేట జంక్షన్ వద్ద నన్నయ ఎంఎస్ఎన్ పీజీ సెంటర్లో శుక్రవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. పీజీ సెంటర్ ఎన్ఎస్ఎస్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, మాణిక్‌రెడ్డి హెల్త్ కేర్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో క్యాంపస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కమలకుమారి, సిబ్బంది, విద్యార్థులతో పాటు ఆదిత్య కళాశాల విద్యార్థులు రక్తదానం చేశారు. ముఖ్యఅతిథులుగా రెడ్‌క్రాస్ సొసైటీ కాకినాడ చైర్మన్ వైడీ రామారావు, మాణిక్ రెడ్డి ఫౌండేషన్ చైర్మన్ మాణిక్‌రెడ్డి సత్యనారాయణ పాల్గొని రక్తదానం వలన కలిగే ప్రయోజనాలు వివరించారు. శిబిరం ఏర్పాటు చేసిన క్యాంపస్ ఎంఎస్ఎన్ అధికారులు మధుకుమార్, శ్రీనివాసరావులను అభినందించారు. రాజ్‌కుమార్ రెడ్డి, మోహన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా యదుసూర్య జయంతి



రక్తదాన శిబిరంలో పాల్గొన్న సత్యనారాయణ మూర్తి తదితరులు

కాకినాడ: ది కాకినాడ కో–ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ మాజీ అధ్యక్షుడు కోసూరి యదుసూర్య 65వ జయంతి సందర్భంగా శుక్రవారం సంఘ ప్రధాన కార్యాలయంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. రోటరీ క్లబ్ సహకారంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని కేసీబీఎస్ అధ్యక్షుడు కోసూరి శ్రీనివాస సత్యనారాయణమూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులతో పాటు పెద్ద ఎత్తున యువత హాజరై రక్తదానం చేశారు. ఈ సందర్భంగా యదుసూర్య చిత్రపటానికి అధ్యక్షుడు శ్రీనివాస సత్యనారాయణమూర్తి, ఉపాధ్యక్షుడు రెడ్డి వీరరాజేంద్ర కుమార్, కార్యదర్శి ముమ్మిడి గోవిందు నివాళులర్పించారు. కోసూరి మాట్లాడుతూ యదుసూర్య ఆశయాలకు అనుగుణంగా సభ్యులకు మెరుగైన సేవలు అందిస్తామన్నారు. సంస్థ డైరెక్టర్లు ముత్తా మధు, ముమ్మిడి వెంకటరమణ, ఒబిలిశెట్టి బాలయోగి, కోసూరి ప్రసాద లావణ్య, మేనేజర్ గంగాధరం, రోటరీ వైద్యాధికారి డాక్టర్ పి.కామరాజు, చిత్రాడ సర్పంచ్ బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వక్ఫ్ బోర్డు ప్రెసిడెంట్, డైరెక్టర్లకు సన్మానం



ముస్లిం మైనారిటీ పథకాలతో జిల్లా వక్ఫ్ బోర్డు ప్రెసిడెంట్, డైరెక్టర్లు, మసీదు పెద్దలు

కాకినాడ రూరల్: రమణయ్యపేట మసీదు కమిటీ ఆధ్వర్యంలో జిల్లా వక్ఫ్ బోర్డు ప్రెసిడెంట్ రెహమాన్ ఖాన్, డైరెక్టర్లు ఎస్‌పి కరీం బాషా, కరీముల్లా తదితరులను శుక్రవారం మసీదు వద్ద సన్మానించారు. రెహమాన్ ఖాన్ మాట్లాడుతూ సీఎం జగన్ ముస్లిం మైనార్టీలకు ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నారని, తమపై నమ్మకంతో వక్ఫ్‌బోర్డు ప్రెసిడెంట్‌గా నియమించారని, డైరెక్టర్లతో కలసి పనిచూస్తూ వక్ఫ్ బోర్డు ఆస్తులను కాపాడుతామన్నారు. నియోజవర్గ వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ నాయకుడు, వక్ఫ్ బోర్డు డైరెక్టర్ కరీం బాషా మాట్లాడుతూ షాదీ కా తోఫా, కల్యాణ మస్తు పథకం ద్వారా 4536 లబ్ధిదారులకు రూ.38 కోట్లను ఆర్థిక సహాయంగా లబ్ధిదారుల ఖాతాల్లో వేశారన్నారు. మసీదు కమిటీ అధ్యక్షుడు ఎంఏ ఖాన్, సెక్రటరీ షేక్ సంధాని, ఎండీ గౌస్, ఎస్‌కే అహమ్మద్, బేగ్, మసీదు కమిటీ సభ్యులు జమాత్, తదితరులు పాల్గొన్నారు.

చెవి సమస్యలపై ఆరోగ్య అవగాహన

కాకినాడ రూరల్: సర్పవరం జంక్షన్‌లోని బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో చెవి సమస్యలపై ఆరోగ్య అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టరు కుమార్ యాదవ్ వైద్య సలహాలు సూచించారు. అడబాల రత్నప్రసాద్, రాఘవరావు, రేలంగి బాపిరాజు తదితరులు పాల్గొన్నారు. ఇదే కార్యక్రమంలో ప్రకృతి వైద్యుడు వేదుల శ్రీరామశర్మ వేపుళ్లు, జంక్ ఫుడ్‌లకు పిల్లలను దూరంగా ఉంచాలని సూచించారు.

పార్కు అభివృద్ధి పనుల పరిశీలన



పార్కు వద్ద అధికారులతో స్థానికులు

కాకినాడ రూరల్: కాకినాడ కార్పొరేషన్ 2వ డివిజన్ పరిధిలోని సౌజన్యనగర్‌లో పార్కు అభివృద్ధి పనులను టౌన్ ప్లానింగ్ అధికారి శివరామకృష్ణ, ఏఈ రమేష్, వర్క్ ఇన్‌స్పెక్టర్ స్వామి తదితరులు పరిశీలించారు. సౌజన్య నగర్ రెసిడెన్షియల్ అసోసియేషన్ సభ్యులు పార్కు అభివృద్ధిపై అధికారులతో మాట్లాడారు.

పులిమేరులో మిన్నంటిన ఆర్తనాదాలు



దుర్గాప్రసాద్ మృతదేహాన్ని చూసి రోదిస్తున్న భార్య సత్య



పులిమేరు యువకుల మృతదేహాలను ర్యాలీగా తీసుకువస్తున్న యువత

- గ్రామంలో అలుముకున్న విషాదఛాయలు
- సామర్లకోట నుంచి మృతదేహాలతో ర్యాలీ
- అంత్యక్రియలకు భారీగా హాజరైన గ్రామస్తులు

పెద్దాపురం: రాష్ట్ర వ్యాప్తంగా కలచివేసిన జి.రాగంపేట అంబటి సుబ్బన్న ఆయిల్ ఫ్యాక్టరీ దుర్ఘటనలో పులిమేరుకు చెందిన ఇద్దరు యువకుల మృతితో రెండు రోజులుగా ఆయా కుటుంబాల ఆర్తనాదాలు మిన్నంటాయి. యల్లమిల్లి విజయదుర్గాప్రసాద్ (27), కట్టమూరు జగదీష్ (25) మృతదేహాలు శుక్రవారం కాకినాడ జీజీహెచ్ నుంచి శవపంచానామా అనంతరం సామర్లకోట వరకు వచ్చాయి. అంబులెన్స్‌కు ముందు పులిమేరు గ్రామ యువత ఆధ్వర్యంలో జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తుమ్మల బాబు, గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు బోనాసు గుర్రాజు, సుందరెడ్డి రాజు, ఎద్దు కుమార్‌ల పర్యవేక్షణలో బైక్ ర్యాలీతో మృతదేహాలను గ్రామానికి తీసుకువచ్చి కటుంబ సభ్యులకు చూపించారు. మృతుల ఇళ్లు పక్కపక్కనే కావడంతో గ్రామస్తులంతా వారి ఇళ్లకు చేరుకున్నారు. నిండు గర్భిణి అయిన దుర్గాప్రసాద్ భార్య సత్య, తండ్రి నూకరాజు, తల్లి వెంకటలక్ష్మి, కట్టమూరి జగదీష్ తల్లి లక్ష్మి మృతదేహాలను చూసి పెట్టిన ఆర్తనాదాలతో గ్రామస్తులంతా కన్నీటి పర్యంత మయ్యారు. వారి మృతదేహాలను కుటుంబ సభ్యులకు చూపించి శశ్మానవాటిక వరకు గ్రామస్తులు ర్యాలీగా వెళ్లారు. రెవెన్యూ అధికారులు, గ్రామస్థుల సమక్షంలో అంత్యక్రియలు నిర్వహించారు.